

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించిన సందర్భంగా అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తొలుపునూరి కృష్ణగౌడ్, బీవీ రమణ, హరినాథ్‌రెడ్డి, జంగయ్య తదితరులు

● అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

ఓపెన్‌కాని రేషన్‌కార్డు
దరఖాస్తుల వెబ్‌సైట్

● నిరాశతో వెనుదిరిగిన ప్రజలు

రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డు కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్, చిక్కడపల్లి, కవాడిగూడ, అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు మీ-సేవ కేంద్రాల వద్ద శనివారం ఉదయం 7 గంటల నుంచే బారులు తీరారు. వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. కొందరు మీ-సేవ నిర్వాహకులతో వాగ్వాదం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి మీ-సేవలో రేషన్‌కార్డు దరఖాస్తుల వెబ్‌సైట్ ఓపెన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.



చిక్కడపల్లి మీ-సేవలో రేషన్‌కార్డు దరఖాస్తుదారులు



చిక్కడపల్లి మీ-సేవ కేంద్రం

రంగరాజాగౌడ్ సేవలు చిరస్మరణీయం

● నివాళులర్పించిన ప్రముఖులు ● మృతికి సంతాపంగా దుకాణాలు బంద్

కవాడిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కవాడిగూడ గౌడ సంఘం అధ్యక్షుడు రంగరాజాగౌడ్ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మొదట జనతాదళ్, జనత పార్టీ, తర్వాత 1983లో బీజేపీలో చేరారని గుర్తు చేసుకున్నారు. బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. చిక్కడపల్లి మెట్రోస్టేషన్ కింద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందిన విషయం విదితమే. శనివారం కవాడిగూడ తాళ్లబస్తీలోని ఆయన నివాసంలో భౌతికకాయానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి బండారు విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, కాసాని జ్ఞానేశ్వర్ నివాళులర్పించారు. అలాగే, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నేతలు శ్యాంసుందర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కవాడిగూడ గౌడ సంఘం నేతలు దూడల శంకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు టి.ఇందిర, టి.రవీందర్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్ కుమార్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, నేతలు సురేష్ ముదిరాజ్, శివముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, అంజన్‌సింగ్, ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు పి.లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బండ జుగేందర్, రవియాదవ్ నివాళులర్పించారు. తాళ్లబస్తీ నుంచి బన్సీలాల్‌పేట్ వరకు సాగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. రంగరాజగౌడ్ మృతికి సంతాపంగా కవాడిగూడ తాళ్లబస్తీ నుంచి కొత్త బజార్ వరకు ఉన్న వ్యాపార సముదాయాలు నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

హరియాణా గవర్నర్ సంతాపం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రంగరాజాగౌడ్ మృతికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం తెలిపారు. 35 ఏళ్లగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రంగరాజాగౌడ్ అంతిమయాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

ఆటో స్వాధీనం?

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు రంగరాజాగౌడ్ మృతికి కారణమైన ఆటోను, ఆటో డ్రైవర్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఆటోను, ఆటో డ్రైవర్‌ను పోలీసులు గుర్తించారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌ను వివరణ కోరగా, ఆదివారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

‘గ్రేటర్‌పై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం’

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌పై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యమని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా నూతన అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి తెలిపారు. సెంట్రల్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. శనివారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో కాచిగూడలో స్వీట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్వీర్, కృష్ణకుమార్, క్షీరసాగర్, సుభాష్‌పటేల్, శ్యామ్‌రాజ్ తదితరులు



ఢిల్లీలో విజయంతో పటేల్‌నగర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌దే నైతిక విజయం

కవాడిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతోపాటు అధికారులు ఆప్‌ను అష్టదిగ్బంధనం చేసినా 43 శాతం ఓట్లు సాధించిందని, నైతిక విజయం తమ పార్టీదే అని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. లిబర్టీ చౌరస్తాలోని ఆప్ తెలంగాణ రాష్ట్ర కార్యాయలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ నేతలు బుర్రా రాముగౌడ్, జావిద్, షరీఫ్, రెహమాన్, కొడంగల్ శ్రీనివాస్, అజీమ్, సురేష్, ఇస్మాయిల్, జాహి, అహసన్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలి

నల్లకుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఈ మేరకు రమణారావు నేతృత్వంలోని బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సమితి నాయకులు దేవులపల్లి రంగారావు, లక్ష్మీనరసింహారావు, రమాకుమార్, మంత్రి సునీల్, దేవులపల్లి అశోక్‌కుమార్, గూడ జయరాం, కె.శ్యామ్‌సుందర్‌రావు, రమేష్ కుమార్, దానం రామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, విక్రమ్ పాల్గొన్నారు.

మాలలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నల్లకుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాలలకు రూ. 10 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రమాబాయి మాలల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డిమల్ల పార్వతి డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణ పేరిట మాలలకు తీవ్రమైన అన్యాయం చేసిందని ఆరోపించారు.

ఇరువర్గాల ఐక్యతతోనే సమాజంలో శాంతి

ముషీరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లింలు ఐక్యంగా ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని ప్రముఖ డాక్టర్ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన ఇషాక్, వాసీమ్ తదితరులు మక్కా యాత్రకు వెళ్తున్న సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లాక్ హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మసూద్, సురేష్, ఉమర్, షరీఫ్, ఇబ్రహీం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నల్లకుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రస్తుతం పెరిగిపోతున్న కాలుష్య భూతం నుంచి జీవరాసులు, మానవజాతిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క నాటాలనే సంకల్పంతో 12 ఏళ్ల నుంచి తమ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడలో ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్.భద్ర, ప్రధాన కార్యదర్శి నిఖిల్‌సాయి కోనేటి, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి రామకృష్ణ, సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్నరావు, హరీష్, దయానందరావు, రిజ్వాన్ అహ్మద్, ఆర్.వినోద్‌రెడ్డి, రామకృష్ణ, శంకర్, నాగభూషణంచారి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై 12న మహాధర్నా

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై ఈ నెల 12న సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సోషలిస్టు పార్టీ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి తెలిపారు. రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు.



అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆకాష్‌నగర్ ఎంపీహెచ్‌కాలనీలో రోడ్డుపై పొంగుతున్న డ్రైనేజీని పరిశీలించారు. జలమండలి సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ శుభ్రం చేయించారు

● అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి



శ్రీనివాస కళ్యాణం ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మేడిబావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమాసదాశివన్, ట్రస్ట్ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు సురేఖ, శైలజాకుమారి పాల్గొన్నారు.

● ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

విద్యతోనే మహిళలకు గౌరవం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



జస్టిస్ రాధారాణి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళలకు గౌరవం లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. శనివారం రాత్రి బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలిలో శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి, తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజమల్లికార్జున్, కార్యదర్శి నివేదితకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన క్రిమినల్ చట్టాలపై యువ న్యాయవాదులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం దక్షిణ భారత అడ్వకేట్స్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్ ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులకు సారథ్యం వహిస్తున్న సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఉపాధ్యాయను సత్కరించారు. కార్యక్రమంలో సీబీఐ కోర్టు న్యాయవాది ఖాసీంసాహెబ్, సీనియర్ న్యాయవాదులు ఆంజనేయులు, ఓంప్రకాష్, అశోక్‌పంబ, మల్లేష్, సతీష్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రికెటర్ ద్రితికేసరీని సత్కరిస్తున్న అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి తదితరులు

పట్టుదలతోనే మహిళా వరల్డ్‌కప్ జట్టులో స్థానం

● అండర్-19 మహిళా క్రికెటర్ ద్రితికేసరీ

రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతోనే తాను అండర్-19 మహిళా వరల్డ్‌కప్ జట్టులో స్థానం పొందానని క్రికెటర్ ద్రితికేసరీ పేర్కొన్నారు. అండర్-19 వరల్డ్ కప్ గెలుచుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ద్రితికేసరిని శనివారం బాగ్‌అంబర్‌పేటలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు సన్మానించారు. రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన ద్రితికేసరీని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ టెక్నాలజీ ఆపరేషన్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సులోచన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంగీతంలో ఉచిత శిక్షణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఉచితంగా సంగీతంలో శిక్షణ ఇస్తున్నామని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. గానసభలో శనివారం సాయంత్రం సంగీత గురువు సంయుక్త శిష్యబృందంచే శాస్త్రీయ గానగోష్ఠి జరిగింది. అన్నమయ్య, త్యాగరాయస్వామి కీర్తనలను మధురంగా గానం చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో జనార్దనమూర్తి మాట్లాడుతూ డా. కేవీ రమణాచారి జన్మదినం సందర్భంగా వారం రోజులపాటు వివిధ కళాప్రక్రియల్లో కార్యక్రమాలను ప్రముఖులచే ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో గాయకుడు త్రినాథరావు, సామాజిక కార్యకర్త వెంకటరావు పాల్గొన్నారు.

తక్కువ ధరకే డ్రై ఫ్రూట్స్ పేరుతో మోసం

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే కాజు, బాదం, పిస్తా వంటి డ్రైఫ్రూట్‌లు విక్రయిస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ఓ వ్యాపారి నుంచి రూ.1.41 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన డ్రైఫ్రూట్స్ విక్రేతకు పంజాబ్ నుంచి ఫోన్ వచ్చింది. వాట్సప్‌లో డ్రైఫ్రూట్‌ల ఫొటోలు పంపించి వాటిని తక్కువ ధరకే విక్రయిస్తామని సైబర్ నేరగాడు తెలిపాడు. నమ్మిన యువకుడు 250 కిలోల జీడిపప్పు కావాలని ఆర్డర్‌పెట్టాడు. వారు సూచించిన ఖాతాలో రూ.1.41 లక్షలు జమచేశాడు. తర్వాత సైబర్ నేరగాళ్లు 900 కిలోల జీడిపప్పు పంపుతామని, మిగతా 650 కిలోల జీడిపప్పుకు డబ్బు పంపాలని కోరారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేశాడు.

బీఎడ్ వెబ్ ఆప్షన్‌కు నేడు చివరి తేదీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డా. బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం-2024 సంవత్సరానికి బీఎడ్ (ఓడియల్) వెబ్ ఆప్షన్ ఆన్‌లైన్‌లో నమోదుకు చివరి తేది ఫిబ్రవరి 9 అని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎడ్ (ఓడియల్) ప్రవేశ పరీక్ష 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్ కోసం రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. స్కాన్ చేసిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నిర్ధారిత రుసుం ఫిబ్రవరి 9వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 040-23680333/444/544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, లేదా విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in లేదా www.braou.ac.inను సందర్శించాలని సూచించారు.

బాగ్‌లింగంపల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో రూ.15.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. డ్రైనేజీ పైపలైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ కె.రవిచారి మాట్లాడుతూ బాగ్‌లింగంపల్లి సెక్షన్ పరిధిలో కలుషిత నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు బబ్లూ, ముదిగొండ మురళీ, కల్యాణ్‌నాయక్, రమేష్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, బీజేపీ నాయకుడు గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి

మార్చి మొదటివారంలో ‘బిల్డ్‌నౌ’

● జీహెచ్ఎంసీలో అమల్లోకి వచ్చే అవకాశం ● ప్లానింగ్ ఉద్యోగులకు ఓరియేంటేషన్ శిక్షణ



బిల్డ్‌నౌపై శిక్షణలో అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు ఆన్‌లైన్‌లో వేగవంతం, పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ‘బిల్డ్‌నౌ’ అనే అప్లికేషన్ జీహెచ్ఎంసీలో మార్చి మొదటివారంలో అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు ఇప్పటికే ఉన్న టీజీబీపాస్ స్థానంలో బిల్డ్‌నౌను తీసుకొస్తున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గతేడాది డిసెంబర్‌లో అధికారికంగా ప్రారంభించగా.. వచ్చే నెల మొదటివారంలో జీహెచ్ఎంసీలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి బిల్డ్‌నౌపై ఓరియేంటేషన్ శిక్షణ ఇచ్చారు. బిల్డ్‌నౌ అప్లికేషన్‌ను వినియోగించే విధానంతో పాటు ఇందులో ఉన్న సరికొత్త అంశాలను వివరించారు. టీజీబీపాస్‌తో పోల్చితే ఏఏ అంశాల్లో మెరుగైన విధానముంటుందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ బిల్డ్‌నౌలో చేర్చాల్సిన అంశాలు, గతంలో ఉన్న టీజీబీపాస్ కంటే మెరుగ్గా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు, ఉద్యోగుల నుంచి సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సీసీపీ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఉన్నత విద్యలో మార్పులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఉన్నత విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకువస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో హెచ్ఆర్ కాన్‌క్లేవ్-2025 సదస్సు నిర్వహించారు. హెచ్ఆర్ నిపుణులు, పరిశ్రమల నిర్వాహకులు మానవవనరుల రంగంలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు-సవాళ్లపై చర్చించారు. ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజనీ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అలీముద్దీన్, గ్రీన్‌కో గ్రూప్ సంస్థ సీనియర్ లీడర్ డాక్టర్ శైలజ, టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ నాగార్జున మల్లాడి, టీసీఎస్ రీజనల్ హెడ్ రిచర్డ్ కింగ్, ఐటీ సొల్యూషన్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.పవన్‌కమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌రావు



ప్రత్యేక పూజలు నిర్వహించిన బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు



అమ్మవారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి మాజీ కార్పొరేటర్ పద్మావెంకటేష్

ఘనంగా శ్రీ నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

గోల్నాక, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గోల్నాక శ్రీలక్ష్మీనగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయం 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎస్.శంకర్ యాదవ్, ప్రధానకార్యదర్శి కొమ్మిడి గోపాల్‌రెడ్డి, కోశాధికారి ఎస్.అనంతయ్య, ప్రతినిధులు మహేందర్, భిక్షపతి, జి.రాజు, బస్తీ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహించిన బాగ్‌అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి దంపతులు

ఆనంద గ్లోరి సేవలు అద్వితీయం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపైనా, చర్చిలపైనా దాడులు జరిగినప్పుడు న్యాయవాది, పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద గ్లోరి సేవలు అద్వితీయమని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద గ్లోరి సేవలను ప్రశంసిస్తూ ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా బిషప్‌లు అహరోను, అనన్య దేవదాస్ మాట్లాడుతూ దాడులు జరిగిన వెంటనే ఆనంద గ్లోరి అక్కడకు చేరుకుని బాధితులకు న్యాయ సహాయం చేయడం, రాజ్యాంగపరమైన హక్కులను కల్పించే విషయంలో ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బిషప్ యోహాను, సాల్మన్‌రాజ్, పాల్ తిమోతి, కుసుమ, జెరుసలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
అంజిరెడ్డి : 99859 21362